సాక్షి నిజామాబాద్

శనివారం । 18 । జనవరి । 2025



క్రీడా ప్రాంగణాలు..
గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. అందులో కనీస సౌకర్యాలు కల్పించలేదు.
- IIలో ▸



అభివృద్ధి పనులకు..
ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి.
- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.9 /16.9

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 9 నుంచి ఎలక్ట్రిషియన్ (30 రోజులు), సీసీ టీవీ (13 రోజులు) కోర్సుల్లో శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19–40 ఏళ్ల యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు ఫొటోలు తీసుకువచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో భోజనం, హాస్టల్ సౌకర్యం పూర్తిగా ఉచితంగా అందజేస్తారన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు టూల్ కిట్ ఇస్తామని తెలిపారు. వివరాలకు 08461- 295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2,500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5 వేలు, సరస్వతి కాలువ ద్వారా 700, లక్ష్మికాలువ ద్వారా 250 క్యూసెక్కులు వదులుతున్నారు. గుత్ప లిఫ్టుకు 135 క్యూసెక్కులు, ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకాలకు 312, మిషన్ భగీరథకు 231, ఆవిరి రూపంలో 397 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 1084.80 (59.6 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ కార్గో

ఖలీల్‌వాడి: డయల్ యువర్ ఆర్టీసీ కార్గో కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ కార్గో ఏటీఎం పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్గో సేవలపై ఉన్న సందేహాలు, సమస్యలను తెలుసుకునేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు తమ సమస్యలపై 8125448423 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక



నిజామాబాద్ అర్బన్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొననున్నారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో భరోసా సెంటర్, మున్సిపల్ జోన్ కార్యాలయాలను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

మత్స్య సహకార సంఘాలను వినియోగించుకోవాలి



బాల్కొండ: మత్స్య సహకార సంఘాలను మత్స్యకారులు వినియోగించుకోవాలని జిల్లా మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు అన్నారు. మెండోరా మండలం బుస్సాపూర్ రైతు వేదిక వద్ద శుక్రవారం ఆయన బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండలాల మత్స్య సహకార సంఘాల చైర్మన్లకు, సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత్స్య సహకార సంఘాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. చెరువుల్లో చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం ఏడీని మత్స్యసహకార సంఘాల సభ్యులు సన్మానించారు. ఎస్‌బీఐ మేనేజర్ అశోక్ చౌహాన్ పాల్గొన్నారు.

సొంత ఎజెండా అమలు!

తెలంగాణ యూనివర్సిటీలో 2014 వివాదాస్పద నియామక అభ్యర్థులకు పదోన్నతులు కల్పించడానికి రిజిస్ట్రార్ ప్రయత్నాలు చేస్తున్నారు. విశ్వ విద్యాలయంలో సమస్యలను పట్టించుకోని ఆయన పూర్తి స్థాయి పాలకమండలి లేకుండానే పదోన్నతులు కల్పించడానికి పావులు కదుపుతున్నారు. అధికారులను తప్పుదోవ పట్టించి తన సొంత ఎజెండా అమలుకు యత్నిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.



- తెయూలో పూర్తిస్థాయి పాలకమండలి లేకుండానే ఏకపక్ష నిర్ణయాలు
- వివాదాస్పద నియామక అభ్యర్థుల పదోన్నతుల కోసం పావులు
- వర్సిటీ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్సిటీలో గందరగోళ పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. పూర్తిస్థాయి పాలకమండలి లేకుండానే ఏకపక్షంగా నిర్ణయాల అమలుకు పావులు కదుపుతున్నారు. దీనిపై గతంలో 'సాక్షి' అనేక సార్లు కథనాలు ప్రచురించింది. అయినా గత పాలకమండలి తిరస్కరించిన 2014 వివాదాస్పద నియామకాల పదోన్నతులు కల్పించే ఫైల్‌ను ముందుకు కదుపుతూ వచ్చారు. రెగ్యులర్ వీసీ లేకున్నప్పటికీ కొన్ని నెలలుగా ఈ ప్రక్రియను రిజిస్ట్రార్ వేగంగా నడిపించినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. రెండేళ్లలో చాపకింద నీరులాగా అక్రమ వ్యవహారాలను సక్రమం చేసుకునేందుకు పావులు కదిపినట్లు చెబుతున్నుఆరు. వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా సొంత లాభం చేకూరే వ్యవహారాలను చక్కబెట్టినట్లు విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థి సమస్యలపై ప్రశ్నిస్తే శాశ్వత వీసీ లేరని చెప్పిన రిజిస్ట్రార్ యాదగిరి వివాదాస్పద 2014 అధ్యాపకుల పదోన్నతులకు మాత్రం ఆమోదం తీసుకొచ్చారని ఆరోపించారు. ఇన్‌చార్జి వీసీల పాలనలోనే రూ.రెండు లక్షలు చెల్లించి లీగల్ ఒపీనియన్ పేరిట పత్రాన్ని తెప్పించి, దాని ద్వారానే ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ ఇప్పించారు. రూ.వేల ఖర్చుతో అయ్యే పనులను మాత్రం పెండింగ్ పెడుతూ వచ్చారు. కోర్టుకు వెళ్తే అప్పీలుకు వెళ్లకుండా 40 మందికి పదోన్నతులు ఇచ్చేందుకు రిజిస్ట్రార్ వ్యూహం రూపొందించినట్లు విద్యార్థి నాయకులు ఆరోపించారు.

■ వీసీ, రిజిస్ట్రార్ వినియోగించుకునేందుకు వర్సిటీ తరపున వాహనం ఉంటుంది. అయితే వర్సిటీకి అర కిలోమీటరు దూరంలో ఉండే రిజిస్ట్రార్ కార్యాలయం వరకు సొంత వాహనంపై వచ్చి పరిపాలనా భవనం వరకు మాత్రమే అధికారిక వాహనాన్ని వాడుతానని చెప్పుకునే రిజిస్ట్రార్ 2014 బ్యాచ్ ప్రమోషన్ల కోసం మాత్రం చాలాసార్లు హైదరాబాద్, నిజామాబాద్ మధ్య చక్కర్లు కొట్టినట్లు విద్యార్థి నాయకులు ఆరోపిస్తున్నారు. అంకిత భావంతో పనిచేస్తున్నట్లు చెప్పే రిజిస్ట్రార్ కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద నోటిఫికేషన్ ఇవ్వకుండా పదోన్నతి కల్పించాలని భావించినట్లు తెలుస్తోంది. 2016లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే పదోన్నతులు కల్పించాలని భావించి మరో నోటిఫికేషన్ కోసం ప్రయత్నించలేదు. జూన్ 6, 2024న పదోన్నతులపై నిబంధనలను సడలిస్తూ యూజీసీ సర్క్యులర్ జారీ చేసింది. దీని పరిధిలోకి వచ్చే ముగ్గురితో పాటు మరో నలుగురు తమకు అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా (రెండు కేటగిరిల్లో) పదోన్నతి కల్పించాలని 2024 సెప్టెంబర్ 23న వినతిపత్రం ఇచ్చారు. దీని ఆధారంగా నోటిఫికేషన్ ఇస్తున్నట్లు పేర్కొని ఐదు కేటగిరీల్లో పదోన్నతుల కోసం అంతర్గత సర్క్యులర్ ఇచ్చారు. అడగని పదోన్నతుల కోసం నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో అంతుచిక్కడం లేదు. 2014 నియామకాల పదోన్నతుల అంశం పలుమార్లు గత ఈసీ సమావేశాల్లో తిరస్కరించిన అంశం చర్చకు తీసుకు రాకుండానే రిజిస్ట్రార్ వ్యవహరించిన తీరుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పదోన్నతులపై పరిశీలించాలని హైకోర్టు సూచించగా, తిరస్కరించినట్లు పాలకమండలి స్పష్టంగా పేర్కొంది. అయినా రిజిస్ట్రార్ లెక్క చేయకపోవడం గమనార్హం.

■ గతంలో విద్యాశాఖలో కీలకంగా ఉన్న ఒక ఉన్నతాధికారి ఇన్‌చార్జిగా వీసీగా పనిచేశారు. ఆయనను రిజిస్ట్రార్ 2014 నియామకాల పదోన్నతుల కోసం 'ఒప్పించి' లీగల్ ఒపీనియన్ కోసం లేఖ రాశారు. అయితే గతంలో ఉన్నత విద్య విభాగం చూసే న్యాయ సలహాదారు నుంచి తీసుకున్న లీగల్ ఒపీనియన్ పరిస్థితి ఏంటి, అది ఈసీలో ఆమోదం పొందినప్పటికీ దాన్ని ఎందుకు అటకెక్కించారనేది అర్థం కాని అంశం. ఇదిలా ఉండగా ఇప్పుడు తీసుకున్న కీలక నిర్ణయాలకు ముగ్గురు క్లాస్–1 ఈసీ సభ్యులకు విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మినహా మిగతా ఇద్దరు వాళ్ల డిప్యూటీలను పంపించినట్లు సమాచారం. పూర్తిస్థాయి (11 మంది) సభ్యుల ఈసీ లేకుండా క్లాస్–1 సభ్యులు తీసుకున్న ఇలాంటి పదోన్నతులపై కాకతీయ వర్సిటీ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటివరకు ఇన్‌చార్జి ఉన్న అధికారి శ్రీధర్ స్థానంలో విద్యాశాఖ కార్యదర్శిగా పూర్తిస్థాయిలో సీనియర్ ఐఏఎస్ అధికారి యోగితారాణాను ప్రభుత్వం నియమించింది. ఇన్‌చార్జి వీసీ లీగల్ ఒపీనియన్ ప్రకారం ఇద్దరు ఇన్‌చార్జి అధికారులతో కూడిన క్లాస్–1 ఈసీ నిర్ణయం మేరకు పదోన్నతులు కల్పిస్తారా అనేది చూడాలని విద్యార్థి నాయకులు అంటున్నారు. ఈ విషయమాలపై వీసీ యాదగిరిరావును 'సాక్షి' వివరణ కోరగా తాను రాకముందు ఎలాంటి ప్రక్రియ జరిగిందో తెలియదని, అయితే ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామన్నారు.

దగాపడ్డ రైతులు

- కాళేశ్వరం పథకం ప్యాకేజీ 21 పైపులు అమ్ముకున్న దళారులు
- ఆరేళ్లుగా ఖాళీ స్థలాల్లో పడి ఉన్న డిస్ట్రిబ్యూటరీ పైపులు
- అవగాహన లేక కొనుగోలు చేసిన కర్షకులు
- కంపెనీ యాజమాన్యం ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు
- పంట పొలాల్లో పాతి ఉంచిన పైపుల రికవరీ

గ్రామాలలో ప్రచారం...

ప్యాకేజీ పనుల పైపులు ఎవరు వినియోగించుకున్నా స్వచ్ఛందంగా పోలీసు స్టేషన్‌కు తరలించాలని పోలీసులు గ్రామాలలో మైక్‌లలో అనౌన్స్‌మెంట్ చేయిస్తున్నారు. రైతులు తాము కొనుగోలు చేశామని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్యాకేజీ పనులకు సంబంధించి వస్తువులు ఎవరూ కొనుగోలు చేసే వీలు లేదని, ఎవరైనా తెలియకుండా కొనుగోలు చేస్తే వారు మోసపోయినట్లే అని అధికారులు చెబుతున్నారు.



మోర్తాడ్ పోలీసులు రికవరీ చేసిన ప్యాకేజీ 21కి సంబంధించిన పైపులు

మోర్తాడ్(బాల్కొండ): పంట పొలాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను అందించడానికి కాళేశ్వరం పథకంలో భాగంగా చేపట్టిన ప్యాకేజీ 21 పనులు సాగకపోవడంతో.. ఈ పథకం కోసం కేటాయించిన పైపులను దళారులు కొందరు పక్కదారి పట్టించారు. ప్యాకేజీ పనులు పూర్తి చేయడానికి టెండర్ దక్కించుకున్న కంపెనీ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో పోలీసు యంత్రాంగం స్పందించింది. దళారులు విక్రయించిన పైపుల రికవరీపై సీరియస్‌గా దృష్టి సారించారు. బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల్లోని వివిధ గ్రామాల చెరువుల వద్ద పైపులను ఆరేళ్ల కింద వేశారు. ప్యాకేజీ 21కి సంబంధించిన ప్రధాన పైప్‌లైన్ పనులు పూర్తి చేసినా పంట పొలాలకు సాగునీటిని అందించడానికి డిస్ట్రిబ్యూటరీ పైపులు వేయాల్సి ఉంది. ప్రతి ఎకరాకు సాగునీటిని అందించడానికి పంట పొలాల మధ్య పైప్‌లైన్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.750 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. ఈ మేరకు నిధులను మంజూరు చేయగా టెండర్ ప్రక్రియ ఎప్పుడో పూర్తి అయ్యింది. రైతులు ప్రతి సీజనులో పంటలను సాగు చేస్తూ ఎప్పుడు కూడా వ్యవసాయ క్షేత్రాలకు విరామం ఇవ్వకపోవడంతో ప్యాకేజీ పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. నీటిపారుదల శాఖ అధికారులు చర్చలు జరిపినా ప్యాకేజీ పనులు చేయడానికి కాంట్రాక్టు కంపెనీకి రైతులు సహకరించలేదు. ఫలితంగా డిస్ట్రిబ్యూటరీ పైప్‌లు అలాగే ఉండిపోయాయి. తిమ్మాపూర్ శివారులోని రాంసాగర్ చెరువు, వడ్యాట్‌లోని ఒక చెరువు, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల్లోని వివిధ గ్రామాలలో నిలువ ఉంచిన పైపులను దళారులు రైతులకు విక్రయించుకున్నారు. ఒక్కో పైప్‌కు రూ.5వేల వరకు వసూలు చేయగా పైప్‌లైన్‌ను పంట పొలాల్లో వేయడానికి ఒక్కో పైప్‌కు రూ.1,500 చొప్పున వసూలు చేశారు. ఒక్కో రైతు రూ.20 వేల నుంచి రూ.30 వేలకు వెచ్చించారు. పైప్‌లు చోరీకి గురవుతున్నా కంపెనీ ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో 1,200 పైప్‌లు మాయం అయ్యాయి. ప్యాకేజీ పైపులు మాయమైన విషయం కంపెనీ యాజమాన్యానికి ఆలస్యంగా తెలిసింది. వెంటనే స్పందించిన కంపెనీ యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికార యంత్రాంగం వేగంగా స్పందించి పోలీసులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు రంగంలోకి దిగారు. గడచిన వారం, పది రోజుల నుంచి పైపుల రికవరీ సాగుతోంది.

పైపులను అప్పగించకపోతే క్రిమినల్ కేసులు

ప్యాకేజీ పైపులను స్వచ్ఛందంగా అప్పగించాలి. లేకుంటే క్రిమినల్ కేసులు ఎదుర్కొనాల్సి వస్తుంది. ఇప్పటి వరకు సగం వరకు పైపులు రికవరీ చేశాం. ఇంకా రికవరీ చేయాల్సి ఉంది. ఎవరైనా అక్రమంగా కొనుగోలు చేసి ఉంటే పైప్‌లను పోలీసు స్టేషన్‌కు తరలించాలి. – విక్రమ్, ఎస్సై, మోర్తాడ్

పసుపు రైతుల అభివృద్ధికి కృషి

జక్రాన్‌పల్లి: పసుపు రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని పసుపు బోర్డు జాతీయ అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి అన్నారు. మండలంలోని మనోహరాబాద్‌లో స్థాపించిన జేఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ సంస్థ చైర్‌పర్సన్ జయశ్రీ, జేఎంకేపీఎం వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు అల్లూరి సంతోష్, గడ్డం శ్రీనివాస్, రాజు, సామ గంగారెడ్డి, పుప్పాల నగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి

20లోగా సర్వే పూర్తి చేయాలి



జలాల్‌పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బాల్కొండ/పెర్కిట్: రైతు భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు కోసం చేపట్టిన సర్వేను ఈ నెల 20లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ముప్కాల్ మండలం నాగంపేట్, బాల్కొండ మండలం జలాల్‌పూర్, ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో సేకరించిన వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. తప్పిదాలకు తావు లేకుండా పారదర్శకంగా జాబితా రూపొందించాలన్నారు. సాగుకు యోగ్యమైన భూములను గుర్తించాలన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్, ముప్కాల్ మండల ప్రత్యేకాధికారి స్రవంతి, బాల్కొండ, ఎంపీడీవోలు విజయభాస్కర్‌రెడ్డి, నరేష్ ఆనంద్, సాయిరాం, తహసీల్దార్లు శ్రీధర్, కృష్ణ, గజానంద్, ఎంపీవో శ్రీనివాస్, ఏవో హరికృష్ణ పాల్గొన్నారు.

పోలీస్ సేవలకు ఫీడ్‌బ్యాక్

- ఠాణాల్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు
- సిబ్బంది పనితీరు తెలుసుకునేందుకు పోలీస్ శాఖ చర్యలు



నగరంలోని ఒకటో టౌన్ ఠాణాలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్

ఖలీల్‌వాడి: పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు తెలుసుకునేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఠాణాలకు వచ్చే ప్రజలకు వారు అందించిన సేవలపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించారు. దీనికోసం ఆయా ఠాణాల్లో ఐదు అంశాల్లో ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. ఆ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదుదారులు, ప్రజలు పోలీసుల పనితీరుపై తమ అభిప్రాయాలు తెలుపొచ్చు. ఇంతకు ముందు డీజీపీ కార్యాలయం నుంచి ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి వివరాలను అడిగేవారు. కేసు పరిస్థితి ఎమిటాని, పరిష్కారం అయ్యిందా లేదా, పోలీసు సిబ్బంది ఎలా ఉన్నారు అనే అంశాలపై ఆరా తీసేవారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తేవడంతో ప్రజలే నేరుగా అభిప్రాయాలను తెలుపొచ్చు.

ఐదు అంశాలపై..

ఠాణాలకు వెళ్లిన ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాక.. పేరు, పోలీస్‌స్టేషన్ పరిధి, మొయిల్ ఐడీ, ఫోన్ నంబర్, బాధితుడి సమస్య, సిబ్బంది పనితీరు తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత మెసేజ్ లేదా ఫోన్ చేయాలా అనే ఆప్షన్ ఉంటుంది. వివరాలను పూర్తి చేసిన తర్వాత అప్‌లోడ్ చేస్తే సీపీ, డీజీపీ కార్యాలయాలకు వివరాలు వెళ్తాయి. దీంతో పోలీసుల పనితీరు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడితో ప్రవర్తించిన విధానం ఉన్నతాధికారులకు తెలుస్తుంది. ఈ అభిప్రాయ సేకరణలో ఐదు అంశాలు ఉన్నాయి. ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్టు ధ్రువీకరణ అంశాల్లో ఫీడ్‌బ్యాక్ అందించొచ్చు. క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతారు. దీంతో పోలీసులలో మార్పు రావడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కాగా పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు కోసం వచ్చే వారితో దురుసుగా ప్రవర్తించే వారికి భయం పట్టుకుంది. అంతేకాకుండా స్టేషన్‌లో చేతివాటం ప్రదర్శించే వారు ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు. ఆన్‌లైన్ అభిప్రాయ సేకరణ ద్వారా పోలీస్‌స్టేషన్లకు గ్రేడింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

ప్రతి స్టేషన్‌లో ఏర్పాటు చేశాం

ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంది. ప్రజలు, ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలి. దీంతో ప్రజలకు, పోలీసులకు సంబంధాలు పెరుగుతాయి.
– రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

- లబ్ధిదారుల ఎంపికకు అధికారుల కసరత్తు
- ఈ నెల 26న ప్రొసీడింగ్స్ అందజేత

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన సర్వే పూర్తయింది. గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరుగుతూ పంచాయతీరాజ్ సిబ్బంది సర్వే చేపట్టారు. జిల్లాలోని 27 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలో సర్వే పూర్తి అయింది. ప్రజాపాలనలో ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేశారు. ఇళ్ల కోసం జిల్లాలోని 27 మండలాల్లో 2,34,623 మంది, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 86,208 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు సర్వే చేశారు. ఈ నెల 20లోపు లబ్ధిదారుల ప్రాథమిక జాబితా రూపొందించనున్నారు. అనంతరం ఆ వివరాలను గ్రామసభల్లో వెల్లడించి, గ్రామసభలో ఆమోదం తర్వాత తుది జాబితా వెల్లడిస్తారు. ఈ నెల 26 ఎంపికైన వారికి ప్రొసిడంగ్‌లు అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లను నియోజకవర్గానికి 3500 చొప్పున కేటాయించారు.



ఆలూర్ మండలం కల్లెడిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న జీపీ కార్యదర్శి

పసుపు బోర్డుకు నిధులు కేటాయించాలి

- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా కేంద్రంగా ప్రారంభించిన పసుపు బోర్డుకు త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు తర్వాత పార్లమెంట్ నియోజకవర్గంలో పరిధిలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాబోయే కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డు వ్యవస్థాగత నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన ఎంపీ అర్వింద్ ధర్మపురి

క్లుప్తంగా

నాగాపూర్ రెండో లిఫ్టుకు మోటార్ సరఫరా



బాల్కొండ: మండలంలోని నాగాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మించిన రెండో లిఫ్టు కోసం మోటార్‌ను ఇరిగేషన్ శాఖ శుక్రవారం సరఫరా చేసింది. నాగాపూర్ మొదటి లిఫ్టు నిర్మాణం 1062 అడుగుల వద్ద నిర్మించారు. ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గినప్పుడు నీరు అందక పంటలు ఎండిపోవడంతో రెండవ లిఫ్టు కోసం గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కానీ పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. ప్రస్తుతం మోటార్ సరఫరా కావడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మోటార్ మంజూరుకు కృషి చేసిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవద్దు



కమ్మర్‌పల్లి: గూడ్స్ క్యారియర్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి పరిసరాల్లో వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్‌లో ప్రయాణికులను తరలిస్తున్నట్లు గుర్తించి హెచ్చరించారు. వాహన ధ్రువపత్రాలు లేని 5 వాహనాలను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని, వాహన ధ్రువీకరణ పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. యూనిఫాం, బ్యాడ్జి నంబర్ తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ జాగ్రత్తలు, ప్రమాదాల గురించి వివరించారు.

పరిమిత లోడ్‌తో వెళ్లాలి

ఖలీల్‌వాడి: గూడ్స్‌వాహనంలో పరిమిత లోడ్‌తో వెళ్లాలని ఎంవీఐలు కిరణ్, రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడి, రైల్వేబిడ్జి వద్ద గూడ్స్ వాహనాలు, ఆటో డ్రైవర్లకు శుక్రవారం వారు రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఆటోల్లో సౌండ్ బాక్స్‌లు, పరిమిత సీట్ల మేరకు ప్రయాణికులను తీసుకెళ్లాలని సూచించారు.

క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం

- అభివృద్ధికి నోచుకోని వైనం
- పట్టించుకోని పాలకులు



మెండోరా మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం

బాల్కొండ: పల్లెల్లో క్రీడాకారులను తీర్చిదిద్దడానికి గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఇప్పటి వరకు ఒక్క క్రీడాప్రాంగాణం అభివృద్ధికి నోచుకోలేదు. పల్లె ప్రగతిలో భాగంగా గత రెండేళ్ల క్రితం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో స్థలం కొరత వలన ఊరు బయట కళ్లాల్లో బోర్డులు పెట్టి ఇదే క్రీడా ప్రాంగణం అంటూ పాలకులు చేతులు దులుపుకున్నారు. ఇప్పటి వరకు ఆ ప్రాంగణాల్లో ఎలాంటి క్రీడా కోర్టులను ఏర్పాటు చేయలేదు. గత నెల రోజుల క్రితం సీఎం కప్ నిర్వహణలో కూడ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను పట్టించుకోలేదు. భవిష్యత్‌లో పట్టించుకుంటారనే నమ్మకం కూడ లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దుట కోసం ఎలాంటి చర్యలు కూడ చేపట్టడం లేదు.

క్రీడా సామగ్రి కరువు..

గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో కనీసం ఇప్పటి వరకు క్రీడా సామగ్రి కూడా తీసుకు రాలేదు. కొన్ని గ్రామాల్లో సరఫరా చేశారు. కానీ అవి కూడ ఎక్కడ దాచారో కూడ తెలియని వింత పరిస్థితి ఉంది. ప్రాంగణంలో క్రీడా కోర్టులు ఏర్పాటు చేయక పోవడంతోపాటు క్రీడలు ఆడేవారు లేకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. క్రీడా సామగ్రిని సరఫరా చేయాలని యువకులు రోజుల తరబడి డిమాండ్ చేస్తున్న పట్టించుకునే వారే లేకుండపోయారు. క్రీడా ప్రాంగాణాలను అభివృద్ధి చేసి కనీసం సరిహద్దులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే క్రీడా సామగ్రిని సరఫరా, ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

ఎలాంటి నిధులు లేవు..

క్రీడా ప్రాంగణాల అభివృద్ధి కోసం ఎలాంటి నిధులు లేవు. క్రీడా సామగ్రిని గతంలోనే జీపీలకు అందించారు. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో, బాల్కొండ

ఆకట్టుకుంటున్న కొబ్బరిచెట్లు



చందూరు మండలంలో పచ్చని పంటపొలాల మధ్య ఉన్న కొబ్బరిచెట్లు ఆకట్టుకుంటున్నాయి. పొలాల ఒడ్డు వెంబడి కొబ్బరి చెట్టు వరుసగా ఉండడంతో కోనసీమ అందాలను తలపిస్తున్నాయని అటుగా వెళ్లేవారు పేర్కొంటున్నారు. పచ్చని పైర్లు, ఆహ్లాద పరిసరాలతో ఈ ప్రాంతం ప్రజలకు కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతిగా డాక్టర్ మావురపు సత్యనారాయణరెడ్డి నియామకమయ్యారు. ఈమేరకు శుక్రవారం తెయూ వీసీ యాదగిరి రావు ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. తనను నియమించిన వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

21న పాదయాత్ర



నిజామాబాద్ సిటీ: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో ఈ నెల 21న నిర్వహించే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వలంటీర్లకు రూ.18 వేల వేతనం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సుకన్య, రేణుక, గంగామణి, లలిత పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

ఖలీల్‌వాడి: మైనర్లు వాహనాలు నడపొద్దని, వారికి వాహనాలు ఇవ్వవద్దని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. ఒకవేళ ఎవరైనా వారికి వాహనాలు ఇస్తే సంబంధిత వాహనాదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోగల ఓ షాపింగ్‌మాల్‌లో శుక్రవారం ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ రైడింగ్, డ్రంకన్‌డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రసాద్, చంద్రమోహన్, షాపింగ్‌మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటులో తుమ్మల పాత్ర ఏంటీ?

- ప్రొటోకాల్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభివృద్ధిపై దృష్టిసారించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి


దినేష్ కులాచారి

సుభాష్‌నగర్: పసుపు బోర్డు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొనడం హాస్యాస్పదమని, బోర్డు ఏర్పాటులో ఆయన పాత్ర ఏంటో ఎమ్మెల్యే భూపతిరెడ్డి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఆహ్వానం లేదని భూపతిరెడ్డి అడుగుతున్నారని, అర్బన్‌లో షబ్బీర్ అలీ, ఆర్మూర్‌లో వినయ్‌రెడ్డి, బాల్కొండలో సునీల్ ఏ హోదాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. కేంద్ర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎంపీ అర్వింద్‌ను పిలవకుండా ఎలా ప్రారంభోత్సవాలు చేశారని ప్రశ్నించారు. ప్రొటోకాల్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. ఎంపీగా కవిత ఉన్న సమయంలో కేంద్రానికి లేఖలు రాయడం వల్లే పసుపు బోర్డు ఏర్పాటైందని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని, పదేళ్లు అధికారంలో ఉండి బోర్డు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఇతర పార్టీ ఎమ్మెల్యేల గురించి కాంగ్రెస్ నాయకులు పోస్టర్లు అతికించారని, అలాంటి పోస్టర్లు పెట్టాలంటే ముందుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలపైనే పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని దినేష్ హితవుపలికారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు, మంజూరు చేసిన నిధుల గురించి శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకుంటే ఫిబ్రవరి 1న దీనిపై తాము చార్జిషీట్ విడుదల చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు ‘ఉపాధి నిధులు’

- జిల్లాకు మెటీరియల్ కంపోనెంట్ కింద రూ.31.39 కోట్లు విడుదల
- బాల్కొండ నియోజకవర్గానికి అత్యధికంగా కేటాయింపు

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కంపోనెంట్ కింద అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులను కేటాయించగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలోని బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాలతోపాటు బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో ఉన్న జిల్లా గ్రామాలకు మొత్తంగా రూ.31.39 కోట్లు విడుదల అయ్యాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను నిధులు విడుదల కావడంతో వచ్చే మార్చి నెలాఖరులోగానే పనులు పూర్తి చేయాల్సి ఉంది.

పరిగణలోకి పనుల విలువ..

గతంలో అన్ని నియోజకవర్గాలకు ఒకే విధంగా నిధులను కేటాయించేవారు. ఈసారి మాత్రం పనుల విలువను పరిగణలోకి తీసుకుని ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో విధంగా నిధులను విడుదల చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో రూ.6.35 కోట్ల విలువ చేసే పనులకు ఆమోదం లభించింది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి రూ.5 కోట్లు, బోధన్ నియోజకవర్గానికి రూ.7.72 కోట్లు, బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని గ్రామాలకు రూ.2కోట్లు విడుదల చేశారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చేసిన ప్రతిపాదనలకు రూ.5.20 కోట్లు, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జీ సునీల్‌రెడ్డి ఇచ్చిన ప్రతిపాదనలకు రూ.5.12 కోట్లు విడుదల అయ్యాయి. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట అధికార పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఇచ్చిన ప్రతిపాదనలకు కూడా నిధులను కేటాయించడం గమనార్హం. బాల్కొండ నియోజకవర్గానికి అత్యధికంగా రూ.10.32 కోట్లు విడుదల కావడం విశేషం. ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు నిర్మించనున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి.

సర్వే నిష్పక్షపాతంగా చేయండి

- అదనపు కలెక్టర్ విక్టర్


సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

ఎల్లారెడ్డి: రైతు భరోసా అమలు కోసం చేపట్టిన సేద్యపు భూముల సర్వేను నిష్పక్షపాతంగా చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. శుక్రవారం ఆయన లక్ష్మాపూర్‌లో జరుగుతున్న సర్వే పనులను పర్యవేక్షించారు. సర్వే నంబర్ల ప్రకారం జరుగుతున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు అందజేశారు. సేద్యానికి పనికిరాని భూములను సర్వే నంబర్‌తో సహా కచ్చితంగా గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో ప్రకాష్, ఏఈవో సతీష్ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన సాయి శివ, పండరి, స్ఫూర్తి

నిజామాబాద్ నాగారం: జాతీయస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ జట్టును ఇటీవల ఎంపిక చేశారు. రాష్ట్ర జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారులు సాయి శివ, పండరి, స్ఫూర్తి ఎంపికయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం క్రీడాకారులను తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యక్షులు కిషోర్, కిషన్, రంజిత్, నరసయ్య, రాజ్ కుమార్ తదితరులు అభినందించారు.

దోమలను నిర్మూలించడమే లక్ష్యం



డిచ్‌పల్లి: వ్యాధులు ప్రబలకుండా దోమల నిర్మూలనే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నివారణ మందును స్ప్రే చేయించాలని మలేరియా కమిటీ సభ్యుడు రాజేందర్, వైద్య సిబ్బందికి సూచించారు. ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూపర్ వైజర్ దేవపాలను ఆదేశించారు. ఆరోగ్య కార్యకర్త మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష

ఖలీల్‌వాడి: ఒకరి మృతికి కారణమైన ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల శుక్రవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని ఇందిరపూర్ కాలనీకి చెందిన కలకొండ శ్రీకాంత్ 2020 అక్టోబర్‌లో బోధన్ రోడ్ లో ఓ హోటల్ వద్ద తన బైక్ పార్క్ చేసి, టీ తాగడానికి వెళ్లాడు. ఈసమయంలో అతని బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సీసీపుటేజీ ద్వారా నిందితులను ఒడ్యాట్‌పల్లికి చెందిన షేక్ ఆసిఫ్, పూలింటి బాబుగా గుర్తించి, వారి ఫోన్ నంబర్లను సంపాదించాడు. తన బైక్ ఇవ్వమని వారిని ఫోన్‌లో కోరగా, బర్ధిపూర్ రోడ్‌లో గల ఈనాడు కార్యాలయం వద్దకు రమ్మన్నారు. శ్రీకాంత్ అతని తండ్రి శాంతయ్య అక్కడికి వెళ్లగా, నిందితులు వారిని తీవ్రంగా గాయపర్చారు. శాంతయ్య గాయాలతో మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఆసిఫ్, బాబులకు శిక్ష విధించారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలు..

ఖలీల్‌వాడి/మాక్లూర్: ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మాక్లూర్ మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన గురజాల ప్రవీణ్‌కు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సంవత్సరం పాటు జైలు శిక్ష రూ.2వేల జరిమానాన విధించినట్లు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. ప్రవీణ్ జూలై 27, 2016న అర్ధరాత్రి గుత్ప గ్రామంలోని ఒక మహిళ తన ఇంటిలో నిద్రిస్తున్న వేళలో అక్రమంగా ప్రవేశించి, అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, కోర్టులో విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జడ్జి శిక్షను ఖరారు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి..

ఎడపల్లి(బోధన్): ఆలయంలో చోరీ చేసిన నిందితుడికి ఏడాది జైలు శిక్షను బోధన్ కోర్టు విధించినట్లు ఎడపల్లి ఏఎస్సై ఇలియాస్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్ గ్రామంలోని గంగమ్మ గుడిలో జులైలో అదే గ్రామానికి చెందిన జరుపుల రాములు చొరబడి నగదు, బంగారం చోరీ చేశాడు. పోలీసులు అతడిని పట్టుకొని విచారించగా, చోరీని ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.1750 రికవరీ చేసి, కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ జరుగగా నిందితుడికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షను జడ్జి విధించినట్లు తెలిపారు.


డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష: 19మందికి జరిమానా

ఖలీల్‌వాడి: డ్రంకన్‌డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్‌జాన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందిని ఇటీవల పట్టుకోగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఇందులో కోర్టు 19మందికి రూ. 43500 జరిమానా విధించగా, మిగిలిన ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం పోలీసులు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ప్రభాకర్ అనే వ్యక్తిని పట్టుకుని కోర్టులో హాజరు పర్చారు. అతడికి రెండు రోజుల జైలు శిక్షను శుక్రవారం బోధన్ కోర్టు జడ్జి విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై రామ్ శుక్రవారం తెలిపారు. అలాగే బియ్యం నిల్వ ఉంచిన ఫైజల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తుల ఆందోళన
- ముస్తాపూర్ తండాలో ఘటన


మోహన్ (ఫైల్)




ప్రమాదానికి కారణమైన లారీ, కేకేవై రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా.. ముస్తాపూర్ తండాకు చెందిన సబావత్ మోహన్(29) గురువారం సాయంత్రం మేతకు వెళ్లిన ఆవులను ఇంటికి తీసుకురావడానికి వెళ్లాడు. ముస్తాపూర్ శివారులోని మూల మలుపు వద్ద కామారెడ్డి నుంచి లింగంపేట వైపు వస్తున్న ఇసుక లారీ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మోహన్‌పైకి దూసుకు వచ్చింది. లారీ చక్రాల కింద మోహన్ ఇరుక్కోగా ఈడ్చుకుంటూ రోడ్డు కిందికి వెళ్లింది. లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారుకాగా, స్థానికులు పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. జేసీబీ సహాయంతో లారీ కింది నుంచి మోహన్‌ను బయటకు తీసి కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి అమ్రియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, బంధువులు, తండావాసులు కేకేవై రోడ్డుపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. దీంతో గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించడంతో ఆందోళన విరమించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు!


తవ్వకాలు చేపట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి, కేశాయిపేట గ్రామాల శివారులో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు సమాచారం. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. కేశాయిపేట గ్రామస్తులు కొందరు శుక్రవారం ఉదయం పంట చేనులకు, బహిర్భూమికి గ్రామ శివారులోకి వెళ్లగా ఒక ప్రదేశంలో పూజలు చేసినట్లు గుర్తించారు. విషయాన్ని గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి రాగా, పూజలు చేసి గుంత తీసి పూడ్చినట్లు ఉండడంతో గుప్త నిధుల కోసం తవ్వినట్లు గుర్తించారు. సదరు స్థలం గ్రామానికి చెందిన గంపల సాయిలుకు చెందినది. గతంలో సాయిలు అదే ప్రదేశంలో బోరు వేయడంతో గుప్తనిధులు కనిపించినట్లు ప్రచారం జరిగింది. అదే సంవత్సరం సాయిలు భార్య అనారోగ్యానికి గురై చనిపోవడంతో గ్రామస్తులు అటువైపు వెళ్లడం మానేశారు. గత మూడు సంవత్సరాల క్రితం కోమట్‌పల్లి అటవీ ప్రాంతంలో పలువురు గుప్త నిధుల కోసం వెతుకుతుండగా గ్రామస్తులు వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తిరిగి అదే ప్రాంతాల్లో గుప్తనిధుల కోసం క్షుద్రపూజలు చేసిన విషయం కలకలం రేపింది.

డీఎంహెచ్‌వో పేరిట వసూళ్లు

- అనుమానం వచ్చి పట్టుకున్న ప్రయివేటు వైద్యులు
- పోలీసుల అదుపులో నిందితుడు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తి డీఎంహెచ్‌వో పేరిట ఆర్ఎంపీ, పీఎంపీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఘటన లింగంపేటలో వెలుగుచూసింది. వివరాలు ఇలా.. కామారెడ్డి ఏరియాలోని లింగాపూర్ పల్లె దవాఖానాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న బాలకృష్ణ శుక్రవారం లింగంపేట గ్రామంలోని ప్రయివేటు వైద్యుల వద్ద తాను మెడికల్ ఆఫీసర్‌నని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. మీపై జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదులు వచ్చాయి. సార్ వస్తే మీ ఆస్పత్రి సీజ్ అవుతుంది. నేను సార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని నమ్మ బలికాడు. దాంతో రషీద్ అనే ప్రయివేటు వైద్యుడు రూ. 15000 ఇచ్చాడు. అనంతరం ముబీన్ వద్దకు వెళ్లి రూ.10వేలు వసూలు చేశాడు.కొద్దిసేపటికి వారికి అనుమానం వచ్చి నిలదీయడంతో పొంతనలేని సమాధానమిచ్చాడు. దీంతో అతడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ప్రైవేటు వైద్యులు లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. 15రోజుల క్రితం బాలకృష్ణ లింగంపేటకు చెందిన మల్లేషం అనే వైద్యుడి వద్ద రూ. 15వేలు తీసుకెళ్లినట్లు తెలిసింది.

కరెంట్‌షాక్‌తో బాలుడికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని మహబూబ్ కాలనీలో కరెంట్ తీగలకు చిక్కుకున్న గాలిపటాన్ని తీసుకుంటుండగా ఓ బాలుడికి గాయాలు అయినట్లు ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన షేక్‌జీషాన్(7) ఇంటి దాబాపై ఒంటరిగా గాలిపటం ఎగురవేయగా విద్యుత్ వైర్లకు చిక్కుకుంది. కుర్చీ వేసుకుని తీస్తుండగా కరెంట్‌షాక్ తగిలి గాయాలు అయ్యాయి. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నికాల్‌పూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాట స్థావరంపై శుక్రవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.3,060 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మరొక వ్యక్తి పరారీలో ఉండగా, పట్టుబడినపై వారిపై కేసు నమోదు చేశామన్నారు.

భీమ్‌గల్ సీఐగా పొన్నం సత్యనారాయణ గౌడ్

ఖలీల్‌వాడి: భీమ్‌గల్ సీఐగా సత్యనారాయణ గౌడ్‌ను నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సత్యనారాయణగౌడ్ రామగుండం సీసీఎస్‌లో పని చేస్తున్నారు. భీమ్‌గల్ సీఐగా పని చేసిన నవీన్ యాదవ్ ఓ కేసు వివాదంలో డీఐజీకి అటాచ్ చేశారు. దీంతో సత్యనారాయణగౌడ్ భీమ్‌గల్ సీఐగా రానున్నారు.